సాక్షి చిత్తూరు
మంగళవారం । 4 । జూన్ । 2024



కూటమితో కుమ్మక్కు!

కౌంటింగ్‌లో అక్రమాలు చేసేందుకు కూటమి నేతలతో కొందరు అధికారులు కుమ్మక్కైనట్లు తెలుస్తోంది.

- 8లో



బంజారా జాతికే ఆదర్శం..

వేంకటేశ్వరస్వామితో పాచికలాడిన హథీరాం బావాజీ పూజ్యనీయులను కేరళ ఐజీ కొనియాడారు.

- 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

క్షయ నివారణే లక్ష్యం




మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): క్షయ నివారణే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. సోమవారం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో క్షయనివారణ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్లు విధిగా గళ్ల పరీక్ష చేసి రిపోర్టులు పంపాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నవారికి కచ్చితంగా గళ్ల పరీక్ష చేయించాలని సూచించారు. సర్మలేని మచ్చలు, అనుమానంగా ఉన్న కేసులను గుర్తించి నిర్ధారణ చేయించాలన్నారు. క్షయ బయటపడితే నివారణకు క్రమం తప్పకుండా మందులు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ప్రతి గురువారం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పక్కాగా నిర్వర్తించాలని కోరారు. సమావేశంలో అధికారులు అనిల్, శివ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్

చిత్తూరు కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు కేంద్రానికి విద్యుత్ సరఫరా నోడల్ అధికారిగా సీజీఎం అయాబ్‌ఖాన్ వ్యవహరిస్తారన్నారు. ఈఈ రవి కుమార్, డీఈలు శేషాద్రి, కొండయ్య, సుబ్రమణ్యం, జ్ఞానేశ్వర్, సతీష్, ఏఈలు రాజా, వరదరాజులు, నీరజ, నరసింహులు, మహబూబ్ బాషా, కేశవులు, బాలచంద్ర, కరిముల్లాఖాన్, రాజేంద్రబాబు, సోమురాజు, విశ్వప్రసాద్, కేశవచంద్ర, వారికి సహాయకులుగా సబ్‌ఇంజనీర్లు, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు కలిపి మొత్తం 33 మందికి డ్యూటీలు వేశామన్నారు. మొత్తం విద్యుత్ సరఫరా పర్యవేక్షణ బాధ్యతను ఈఈలు హరి, పద్మనాభపిళ్లై నిర్వర్తించనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ సమస్య వస్తే ప్రత్యామ్నాయంగా 2 జనరేటర్లను సైతం అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

నేడే తీర్పు



21 రోజుల నిరీక్షణకు తెరపడనుంది. ఎన్నికల రణరంగంలో ఆఖరి ఘట్టం ఆసన్నమైంది. మంగళవారం ఉదయం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానుంది. అభిమానులు..అభ్యర్థుల టెన్షన్‌కు తెరపడనుంది. విజయతీరాలకు చేరేదెవరో.. ఓటమి బాటన పయనించేదెవరో తేలిపోనుంది. ఈ క్రమంలో ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఫలితాల ప్రకటన అనంతరం అభ్యర్థులను ఇంటి వద్ద దింపేంతవరకు ఎస్కార్ట్ భద్రత కల్పించనుంది.



ఓట్ల లెక్కింపు నిర్వహించనున్న ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల

కౌంటింగ్ సమాచారం

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలైన ఓట్లు	ఓట్ల లెక్కింపు రౌండ్లు
నగరి	231	1,76,399	17
జీడీ నెల్లూరు	256	1,81,779	19
చిత్తూరు	226	1,64,788	17
పూతలపట్టు	262	1,93,730	19
పలమనేరు	288	2,35,476	21
కుప్పం	243	2,02,920	18
పుంగనూరు	266	2,06,916	19
మొత్తం	1,772	13,62,008	130

ఈ రోజే నే'తల' రాత మారేది

- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- సర్వత్రా ఉత్కంఠ
- ఏజెంట్లకు ధ్రువీకరణపత్రాలు తప్పనిసరి
- మద్యం తాగితే నో ఎంట్రీ
- ముందుగా పోస్టల్ బ్యాలెట్‌లు, తర్వాత ఈవీఎంలు
- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత, 144 సెక్షన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రజా తీర్పు నేడు వెలువడనుంది. ఈ ఎన్నికల్లో ఆఖరి ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు సమయం ఆసన్నమైంది. జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలనుంది. చిత్తూరు సమీపంలో ఆర్‌వీఎస్ నగర్ వద్ద ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ సెంటర్‌లో నేడు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. ఇందుకు అధికారిక యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలుకానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం ఈవీఎం లెక్కింపు ప్రారంభమవుతుంది. కౌంటింగ్ కేంద్రంలో ఇందుకోసం 15 హాళ్లను పూర్తి వసతులతో అందుబాటులోకి తీసుకువచ్చారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లుచేసింది. కౌంటింగ్ కేంద్రంలో ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్‌లను వేర్వేరుగా లెక్కించేందుకు టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఆయా టేబుళ్ల వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్‌లు ఉంటారు. ప్రతి రిటర్నింగ్ అధికారి, ఏఆర్‌ఓ, అబ్జర్వర్ పర్యవేక్షిస్తారు.

కౌంటింగ్ ఇలా..

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికార యంత్రాంగం అనేక ఫారాలు వినియోగిస్తోంది. వీటిల్లో ప్రతి ఫారానికి ఒక ప్రాధాన్యం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒకేసారి చేపట్టనున్నారు. ఫలితాల బటన్ నొక్కగానే ప్రతి అభ్యర్థికీ పోలైన ఓట్లు ఈవీఎంలో కనిపిస్తాయి. ప్రతి రౌండ్ లెక్కింపునకు ముందు కౌంటింగ్ ఏజెంట్లతో 17-సీ ఫామ్‌లో తప్పనిసరిగా సంతకాలు తీసుకుంటారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఫామ్-20లో నమోదు చేసి కంట్రోల్ రూమ్, మీడియా కేంద్రాలకు పంపిస్తారు. సువిధ యాప్‌లో నమోదు చేసిన తర్వాత మాత్రమే రౌండ్ల వారీ ఫలితాలను మైక్రో అబ్జర్వర్, రిటర్నింగ్ ఆఫీసర్ అధికారికంగా ప్రకటిస్తారు.

తాగి ఊగితే నో ఎంట్రీ!

- కౌంటింగ్ కేంద్రం వద్ద రాజకీయ పార్టీల ఏజెంట్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తారు.
- ఆల్కహాల్ పర్సంటేజ్ ఉన్నట్లు చూపితే కేంద్రంలోకి అనుమతించరు.
- ఉదయం 6 గంటలకల్లా ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలి.
- పార్టీ కార్యకర్తలను కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకు రాకూడదు.
- కౌంటింగ్ కేంద్రాల బయట, రోడ్లపై విజయోత్సవ ర్యాలీలు నిషేధం.
- బాణసంచా కాల్చకూడదు. ఫంక్షన్ హాల్స్, హోటల్స్‌లో జనసమీకరణ చేపట్టరాదు.
- వాట్సాప్ గ్రూప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదు.
- ఇతర పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగకూడదు.
- ఓడిపోయిన అభ్యర్థులపై వ్యంగ్యాస్త్రాలు సంధించరాదు.
- 6వ తేదీవరకు ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదు.
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తప్పవు

క్షుణ్ణంగా తనిఖీ



కౌంటింగ్ కేంద్రం వద్ద తనిఖీలు

విధుల్లో ఉండే సిబ్బంది, ఏజెంట్లతో సహా కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతించనున్నారు. సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, వాకీటాకీలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, పెన్నులు, సిగరెట్లు, మండే స్వభావమున్న వస్తువులు, రంగులు, పూల దండలు, మంచినీళ్ల బాటిళ్లు తదితరాలు కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకు రావడాన్ని నిషేధించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ ను విధించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్‌ల సహాయంతో నిరంతరం నిఘా పెట్టనున్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ భవనాల ప్రవేశ ద్వారం నుంచి కౌంటింగ్ హాళ్ల వరకు ఉన్న ప్రదేశాన్ని రెండో అంచెగా పరిగణిస్తారు. ఆ ప్రదేశాల్లో తగినంత మంది రాష్ట్ర సాయుధ పోలీసులు బందోబస్తులో ఉంటారు. కౌంటింగ్ కేంద్రంలో మూడవ అంచె భద్రతను ఏర్పాటు చేశారు. అక్కడ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలని, హాల్ మొత్తం తిరిగేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు.



ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు

సర్వం సిద్ధం



ఓట్ల లెక్కింపుపకు సర్వం సిద్ధం చేశాం. కౌంటింగ్‌లో ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేపట్టాం. కౌంటింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చాం. పటిష్టమైన మూడంచెల బందోబస్తును ఏర్పాటు చేశాం. మొత్తం ప్రక్రియ సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలి. ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. – షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

కట్టుదిట్టంగా నిఘా



జిల్లాలోని పలు చోట్ల పోలింగ్ రోజున జరిగిన విపరీత పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి కౌంటింగ్‌పైనే పడింది. హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం గట్టి చర్యలు తీసుకుంది. ప్రధానంగా ఫలితాల అనంతరం ఎక్కడా సమస్యలు రాకుండా ఉండేందుకు పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంది. ప్రతి నియోజకవర్గంలో కేంద్ర సాయుధ బలగాలతో పాటు స్థానిక పోలీసులను రంగంలోకి దింపింది. జిల్లా మొత్తం కట్టుదిట్టంగా నిఘా పెట్టింది. గొడవల్లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

- కౌంటింగ్ నేపథ్యంలో భారీగా బలగాల మోహరింపు
- పకడ్బందీగా 144 సెక్షన్.. పోలీస్ యాక్ట్ 30 అమలు
- మూతపడిన మద్యం దుకాణాలు.. బార్లు
- ఫలితాల అనంతరం సంబరాలపై నిషేధం
- ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్న పోలీసులు



చిత్తూరులో కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు భద్రత

చిత్తూరు అర్బన్: ఓట్ల లెక్కింపు తర్వాత సున్నితమైన అంశాలపై ఒకరిపై మరొకరు కవ్వింపు చర్యలకు పాల్పడటం, గొడవలకు దిగడం చేయకుండా ఉండేందుకు ఇప్పటికే గ్రామాల్లో పోలీసులు రంగం ప్రవేశం చేశారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర సాయుధ బలగాలు, స్థానికుల పోలీసులు పహారా కాస్తున్నారు. పోలింగ్ రోజున గొడవలు జరిగిన గ్రామాలపై సైతం దృష్టి సారించారు. గొడవలు సృష్టించే వ్యక్తులపై స్పెషల్‌బ్రాంచ్, ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా నిఘా ఉంచి వారి కదలికలను గమనిస్తున్నారు. ఎక్కడైనా ఘర్షణ జరిగే అవకాశం ఉందనిపిస్తే, అనుమానితులను అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు రాజకీయ నేతల కార్యాలయాలు, నివాసాల వద్ద క్విక్ రియాక్షన్ టీమ్స్ పేరిట అయిదు వాహనాలతో బృందాలను ఏర్పాటు చేశారు. వీటికి కెమెరాలు అమర్చారు. ఎవరైనా గొడవలు చేస్తే సాక్ష్యాలను సేకరించి, న్యాయస్థానంలో దోషిగా నిరూపించడానికి కెమెరా పుటేజీలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు.



చిత్తూరు నగరంలో పోలీసు పహారా

పకడ్బందీగా నిబంధనలు

ఫలితాలు వెలువడిన తర్వాత అభ్యర్థులు ఎక్కడా కూడా ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సెక్షన్ పోలీస్ 30 యాక్టు అమల్లో ఉంటుందని ప్రకటించారు.గెలిచిన వ్యక్తికి ఫ్లెక్సీలు పెట్టడం, బ్యానర్లు ఏర్పాటు చేయడం ఉండకూడదని ఉత్తర్వులిచ్చారు. రౌడీషీటర్లు, అనుమానితులను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ల వద్ద బైండోవర్‌చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వీరు ఇచ్చిన బాండ్లను రద్దు చేయడంతో పాటు అరెస్టు చేస్తామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు ఎక్కడా కూడా గుంపులుగా ఉండకుండా 144 సెక్షన్ అమల్లోకి తెచ్చారు.

రేపటి వరకు మద్యం బంద్

ఎన్నికల ఫలితాల సందర్భంగా ఈసారి జిల్లాలో మద్యం విక్రయాలపై అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో మూడు రోజుల పాటు మద్యం విక్రయాలపై నిషేధం విధించారు. 5వ తేదీ వరకు మద్యం దుకాణాలు, బార్లు తెరవకూడదని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి ఆయేషా బేగం ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా మద్యం విక్రయాలు జరిగితే 9949351040 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.


ఐజీ పర్యవేక్షణ

ఓట్ల లెక్కింపు, శాంతి భద్రతల పర్యవేక్షణకు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఐజీ స్థాయి అధికారిని కేటాయించారు. సోమవారం ఈ మేరకు ఐజీ కేవీ మోహన్‌రావు చిత్తూరులోని ఎస్వీ సెట్ కౌంటింగ్ సెంటర్‌ను ఎస్పీ మణికంఠతో కలిసి పరిశీలించారు. భద్రత, సీసీ కెమెరాల పనితీరు, స్ట్రాంగ్‌రూమ్ గదుల వద్ద నిఘాను తనిఖీ చేశారు. కౌంటింగ్ రోజు నిస్పక్షపాతంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఐజీ హెచ్చరించారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐజీ మోహన్‌రావు, ఎస్పీ మణికంఠ

సహకరించండి



ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తి చేసేందుకు అభ్యర్థులు సహకరించాలని కోరుతున్నాం. ఫలితాలు వెలువడ్డాక హుందాగా ప్రవర్తించండి. నాయకులతో పాటు కిందిస్థాయి వాళ్లు కూడా సంయమనం పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే మాత్రం సహించం. ప్రతి ఒక్కరూ కచ్చితంగా రూల్స్ పాటించాల్సిందే. ప్రజలకు ఎక్కడైనా ఇబ్బంది వస్తే 9440900005, 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలి. వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటాం.

– మణికంఠ, ఎస్పీ, చిత్తూరు

సకాలంలో రాకుంటే చర్యలు



మాట్లాడుతున్న చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : కౌంటింగ్ సిబ్బంది కేంద్రానికి సకాలంలో రాకుంటే చర్యలు తప్పవని చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఓ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపులో ఎలాంటి తప్పిదాలు చేయకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. సిబ్బంది కచ్చితంగా ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి రావాలని, ఆదేశాలను ఉల్లంఘిస్తే సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరైతే సహించే ప్రసక్తే లేదని, వేటు తప్పదని తెలిపారు. ముందుగా టేబుళ్ల దగ్గరకు తెచ్చేందుకు ఈవీఎంల స్విచ్ ఆన్ చేయాలని సూచించారు. కంట్రోల్ యూనిట్‌లోని 17-సీలో ఉన్న నంబరు ఒక్కటిగా ఉంటే ఎలాంటి సమస్యలుండవన్నారు. అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లను సంబంధిత ప్రొఫార్మాలో కౌంటింగ్ ఏజెంట్లతో సంతకం చేయించిన తర్వాత ఆర్‌ఓకు పంపాలని తెలిపారు. రెండు సార్లు ఫలితాలను వివరించాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ఆర్‌ఓల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అభ్యర్థులు, ఏజెంట్లకు చూపిస్తూ లెక్కించాలని స్పష్టం చేశారు. పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు రెండు టేబుళ్లలో నాలుగు రౌండ్లుగా జరుగుతుందని వివరించారు. ఉదయం ర్యాండమైజేషన్ నిర్వహించి సిబ్బందికి టేబుల్స్ కేటాయిస్తామని వెల్లడించారు. సిబ్బంది మొబైల్స్ తీసుకువస్తే డిపాజిట్ సెంటర్ అందించి లోపలికి రావాలని ఆదేశించారు.

వ్యవసాయ డిప్లొమో కోర్సుకు దరఖాస్తులు

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే వ్యవసాయ పాలిటెక్నికల్ డిప్లొమో కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీ.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు ఆగస్టు 31 నాటికి 22 సంవత్సరాలకు లోబడి ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం , మున్సిపాలిటీ పరిధిలోని విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించనున్నట్టు వెల్లడించారు. ఆసక్తిగలవారు20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0877-2249909, 9618167187 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న జి.షణ్ముగం (32) అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఉలసయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. చిత్తూరు వీరభద్రకాలనీలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ ఇక్బాల్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. షణ్ముగం గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఇప్పటికే రెండు కేసులు, రౌడీషీట్ కూడా ఉన్నట్లు సీఐ వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

పుంగనూరులో చైన్ స్నాచింగ్

పుంగనూరు : పట్టణంలోని ప్రైవేట్ బస్టాండ్ వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వివరాలు.. పద్మావతమ్మ అనే వృద్ధురాలు మధ్యాహ్నం బెంగళూరు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా దుండగులు ఆమె మెడలోని సుమారు 60 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి , సీసీ ఫుటేజ్ ఆధారంగా చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పట్టపగలే బస్టాండు వద్ద చోరీ జరగడంపై పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

కూటమితో కుమ్మక్కు!



కూటమి నేతలతో కొందరు అధికారులు కుమ్మక్కయ్యారా.. కౌంటింగ్‌కు తమకు అనుకూలమైన అధికారులను వేయించుకున్నారా..? నేడు జరగనున్న ఓట్ల లెక్కింపులో అక్రమాలు.. దౌర్జన్యాలకు స్కెచ్ వేశారా..? అంటే జిల్లా వాసుల నుంచి అవుననే సమాధానం వస్తోంది. కౌంటింగ్‌లో కూటమి అభ్యర్థులు పైచేయి సాధించేందుకు కొందరు అధికారులు అడ్డదారులు తొక్కేందుకు సిద్ధమైనట్టు స్పష్టమవుతోంది.

కౌంటింగ్‌లో కొట్లాటకు స్కెచ్

- అనుకూలమైన అధికారులకు డ్యూటీలు
- పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో అడ్డదారులు
- ఈవీఎంలో మొత్తం ఓట్ల లెక్కింపులోనూ అక్రమాలు
- కాంగ్రెస్ ఏజెంట్ ఫామ్స్‌ని చేజిక్కించుకున్న కూటమి నేతలు
- ఏజెంట్ల నియామకం విషయంలో స్వతంత్ర అభ్యర్థులకు మొండిచేయి
- కూటమి నేతల కనుసన్నల్లో కొందరు అధికారులు బరితెగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కౌంటింగ్‌లో అక్రమాలు.. దౌర్జనాలకు కూటమి అభ్యర్థులు పక్కా ప్రణాళికలు రూపొందించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ఇచ్చిన ఆదేశాలను ఆసరాగా చేసుకుని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కూటమి నేతలు కొందరు అధికారుల సహకారంతో రంగం సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు స్వతంత్ర అభ్యర్థులు అడ్డొస్తారని వారికి ఏజెంట్లను కుదించడమే ఇందుకు నిదర్శనం. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ, చిత్తూరు ఎస్వీ సెట్‌లో నేడు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కూటమికి ఓటమి తప్పదని భావించిన అభ్యర్థులు టీడీపీ సానుభూతిపరులైన అధికారుల ద్వారా మరికొందరు అధికారులను రకరకాల ప్రలోభాలతో లోబరుచుకున్నారు. వారందరికీ కౌంటింగ్ కేంద్రంలో డ్యూటీలు వేయించుకున్నట్లు పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. వారి సహకారంతో కౌంటింగ్ కేంద్రంలో అక్రమాలు, దౌర్జన్యాలకు దిగేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

తారుమారు చేసి.. కూటమికి అనుకూలంగా మార్చే కుట్ర

అడ్డదారుల్లోనైనా గెలుపొందాలని కూటమి నేతలు అన్ని మార్గాలను ఎంచుకున్నారు. ఈవీఎంలో పోలైన ఓట్ల లెక్కింపు సమయంలో కూటమి ఏజెంట్లు రచ్చచేసి వైఎస్సార్‌సీపీ ఏజెంట్ల దృష్టి మరల్చేందుకు పథకం వేసినట్లు తెలిసింది. ఈవీఎంలోని మొత్తం ఓట్ల లెక్కింపు విషయంలో తమకు అనుకూలంగా లెక్కలను తారుమారు చేసేందుకు స్కెచ్ వేసినట్లు సమాచారం. మొత్తంగా నేటి కౌంటింగ్ సమయంలో అడ్డదారులన్నింటినీ ఉపయోగించుకుని పైచేయి సాధించేందుకు కూటమి నేతలు కుట్రలకు పదునుపెట్టారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు కౌంటింగ్ కేంద్రంలో అక్రమాలు, దౌర్జనాలకు తావులేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులు, ఓటర్లు కోరుతున్నారు.

వీలైనన్ని పోస్టల్ బ్యాలెట్ ఓట్లే లక్ష్యంగా..

అధికారులంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని ప్రచారం చేసిన కూటమి నేతలు.. నేడు జరగనున్న కౌంటింగ్‌లో దాన్ని అవకాశంగా వినియోగించుకోవాలని కుయుక్తులు పన్నుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇందులో భాగంగా ఈసీ ఆదేశాలను బూచీగా చూపి వీలైనన్ని పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూటమి అభ్యర్థికి అనుకూలంగా మలచుకునేందుకు పథకం వేసినట్లు సమాచారం. అందుకు అడ్డుగా ఉన్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను రెచ్చగొట్టి బయటకు పంపేందుకు స్కెచ్ వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్ల విషయంలోనూ ముందే అడ్డుకట్ట వేశారు. టేబుల్‌కి ఒక ఏజెంట్‌ని నియమించుకునే అవకాశం అభ్యర్థి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గుర్తింపు పొందిన పార్టీలకు మాత్రమే టేబుల్‌కి ఒక ఏజెంట్‌ని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. స్వతంత్ర అభ్యర్థుల విషయానికి వచ్చే సరికి కేవలం 5, 6 మంది ఏజెంట్లను మాత్రమే నియమించుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని స్వతంత్ర అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము అభ్యర్థే కదా? అన్నీ టేబుల్స్ వద్ద ఏజెంటు ఉండకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. అయినా వారికి ఎన్నికల అధికారి ససేమిరా అన్నట్లు స్వతంత్ర అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బలగం కోసం కొత్త ఎత్తుగడ

కౌంటింగ్ కేంద్రలో అక్రమాలు, దౌర్జన్యాలకు బలగం ఉండేలా కూటమి అభ్యర్థులు కాంగ్రెస్ ఏజెంట్ ఫామ్స్‌ని కొనుగోలు చేసుకున్నట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైనా ఆ పార్టీ తరుపున అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. జాతీయ పార్టీ కావడంతో కాంగ్రెస్ అభ్యర్థికి టేబుల్‌కి ఒకరు చొప్పున ఏజెంట్‌ని నియమించుకునే అవకాశం ఉంది. పేరుకు మాత్రమే పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి తమ ఏజెంట్ ఫామ్స్‌ని కూటమి అభ్యర్థులకు విక్రయించి సొమ్ముచేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంగ్రెస్ ఏజెంట్ ఫామ్స్‌తో కూటమి నేతలు కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించనున్నారు. కౌంటింగ్ కేంద్రంలో కూటమి నేతలకు బలం ఎక్కువ ఉండడంతో అక్రమాలు, దౌర్జన్యాలు చేసేందుకు అవకాశం ఉన్నట్లు అధికారులు కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బలగంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వీలైనన్ని కూటమి అభ్యర్థి లెక్కలో వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఏ చిన్న పొరబాటు ఉన్నా.. కూటమి అభ్యర్థి అకౌంట్‌లో వేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు.

పింఛన్ కోసం వెళ్లి వృద్ధుడి మృతి


కృష్ణప్ప (ఫైల్)

పుత్తూరు : పింఛను కోసం వెళ్లిన ఓ వృద్ధుడు వడదెబ్బ తగిలి సోమవారం మృతి చెందాడు. వివరాలు.. పట్టణ పరిధిలోని ఆరేటమ్మ ఎస్టీ కాలనీకి చెందిన కె.కృష్ణప్ప(81) అనే వృద్ధుడు శనివారం పింఛన్ కోసం సచివాలయం వద్దకు వెళ్లి క్యూలో నిలబడ్డాడు. ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి కింద పడిపోయాడు. సచివాలయ సిబ్బంది అందించిన సమాచారం మేరకు వృద్ధుడి కుటుంబీకులు అక్కడకు వెళ్లి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కృష్ణప్ప మృతి చెందాడు.

బాలికపై లైంగిక దాడికి యత్నం!

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణ పరిధి, గాంధీనగర్‌లోని ప్రశాంత్‌నగర్ ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు సమాచారం మేరకు.. ప్రశాంతనగర్ ప్రాంతంలో సోమవారం వీధిలో తోటి పిల్లలతో కలసి ఆడుకుంటున్న సమయంలో యువకుడు మాయ మాటలు చెప్పి బాలికను పక్కకు తీసికెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో యువకుడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి చెట్టుకు కట్టేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయంపై రెండో పట్టణ పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అది అవాస్తవం

చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గంలో మారణాయుధాలతో రౌడీ మూకలు తిరుగుతున్నారన్న వార్త పూర్తిగా అవాస్తమని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం ఓ ప్రటన విడుదల చేశారు. జీవనోపాధి కోసం మంగళూరులో చేపల వేటకు వెళ్లి సీజన్ ముగియడంతో టెంపో ట్రావెలర్ వాహనంలో తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా చిత్తూరు – తిరుపతి జాతీయ రహదారిపై పాకాలవారి పల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు జరిపిన వాహన తనిఖీలలో 29 ఫుల్ బాటిళ్ల మద్యం, 26 టిన్ బీర్ బాటిళ్ల మద్యం, ఎండు చేపలు, పచ్చి చేపలు, చేపలు కోయడానికి ఉపయోగించే 2 కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి రూరల్ మండలానికి చెందిన 13 మందిని అదుపులోకి తీసుకుని, చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మారణాయుధాలు, మద్యం బాటిళ్లు కలిగి రౌడీ మూకలు చంద్రగిరి నియోజకవర్గంలో తిరుగుతున్నారంటూ తప్పుడు వార్తను వాట్సాప్ గ్రూపులో పోస్టింగులు పెట్టారని తెలిపారు. ఇలా తప్పుడు పోస్టు పెట్టిన వ్యక్తితో పాటు గ్రూప్ అడ్మిన్ పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదని, శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు.

మద్యం స్వాధీనం

కోట: కోట మెయిన్ రోడ్డు వద్ద సోమవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వాకాడు ఎస్ఈబీ సీఐ శ్రీనివాసులు తెలిపారు. కోటకు చెందిన గుర్రం పెంచలయ్య, వెంకటకిష్టయ్యను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఫుట్‌బాల్ విజేత నెల్లూరు


విజయం సాధించిన నెల్లూరు జట్టు క్రీడాకారులతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలగుంట క్రీడా మైదానంలో జోనల్ స్థాయి జూనియర్ బాలుర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లా జట్లు పాల్గొన్నాయి. రౌండ్ రాబిన్ లీగ్ పోటీలుగా స్టేట్ క్వాలిఫైడ్ రెఫరీలు రాజీవ్, శామ్యూల్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు విజేతగా, తిరుపతి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ పోటీలో గెలుపొందిన నెల్లూరు జట్టు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీఓ) ఎస్.సయ్యద్ సాహెబ్ తెలిపారు. కోచ్‌లు వినోద్, రమేష్, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసులు, ప్రభాకర్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డెప్ప, క్రీడాకారులు పాల్గొన్నారు.

హనుమంతునికి పుష్పాభిషేకం

చిల్లకూరు: హనుమజ్జయంతి పురస్కరించుకుని మంగళవారం తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలో వెలసి ఉన్న పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాభిషేకం నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహించిన హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా చివరి రోజున ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, తమలపాకుల ఆరాధన, అనంతరం తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం చందనాలంకారం, పూలంగి సేవ చేపట్టారు.


హనుమజ్జయంతి సందర్భంగా విశేష పూజల్లో ఉభయ కర్తలు


పుష్పాభిషేకంలో హనుమంతుడు

తిరుపతిలో సినిమా షూటింగ్


సినిమా యూనిట్ సభ్యులు

తిరుపతి కల్చరల్: ధర్మ క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్–1 ఆధ్వర్యంలో నిర్మించనున్న కొత్త చిత్రం వెంకటనరసింహరాజువారి పేట రైల్వేస్టేషన్ సినిమా షూటింగ్ సోమవారం కోటకొమ్మల వీధిలోని ఓ ఇంటిలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు శ్రీధర్ వర్మ మాట్లాడుతూ సరికొత్త జోన్‌లో సస్పెన్స్, థ్రిల్లర్, హర్రర్‌తో కూడిన కథతో సినిమా రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి తిరుపతి, మామండూరు పరిసర ప్రాంతాల్లో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ చేపట్టి రెండు షెడ్యూల్‌లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానపాత్రలో తిరుపతికి చెందిన భీమాస్ అశోక అభి, గగన, సునీల్, వినుకొండ రవి, క్రిస్టోఫర్లు నటించగా, ఇతర పాత్రలో షీలా, కామెడి శాస్త్రి, హరి, శ్రీనివాసులతో పాటు పేద కళాకారులకు సైతం అవకాశం కల్పించి వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం అనిల్, సినిమా ఫొటోగ్రఫీ నటరాజ్, ఎడిటింగ్ వీఎఫ్ఎక్స్ ధ్యాను, కోడైరెక్టర్ రామస్వామి, అసోసియేట్ డైరెక్టర్‌గా సుధీర్, మేకప్ కిషోర్, వ్యవహరిస్తారని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు




తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కర్ణాటక ఎంపీ, సినీ నటి సుమలత, నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ మనీష్ కుమార్ షా, ఫారెస్ట్ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, ఫారెస్ట్ పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరి, కర్ణాటక ఎంపీ, సినీ నటి సుమలత, నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్ మనీష్‌కుమార్‌షా, కేంద్ర మాజీ మంత్రి రేణుకచౌదరి, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.


కేంద్ర మాజీ మంత్రి రేణుక చౌదరి

బంజారా జాతికే ఆదర్శం హాథీరాం బావాజీ

- ప్రపంచంలోనే ప్రప్రథమ విగ్రహం అద్భుతం
- ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- కేరళ రాష్ట్ర ఐజీ గూగులోత్ లక్ష్మణ్‌నాయక్


హాథీరాం బావాజీ ఆలయంలో పూజలు చేస్తున్న కేరళ ఐజీ లక్ష్మణ్ నాయక్

తిరుపతి రూరల్: సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామితో పాచికలాడిన హాథీరాం బావాజీ బంజారా జాతికే ఆదర్శప్రాయులని కేరళ రాష్ట్ర పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) గూగులోత్ లక్ష్మణ్ నాయక్ కొనియాడారు. ప్రపంచంలోనే ప్రప్రథమంగా శ్రీవారి పాదల చెంత ఏర్పాటు చేసిన హాథీరాం బావాజీ విగ్రహం అద్భుతమని పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురంలో నిర్మించిన హాథీరాం బావాజీ ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న గూగులోత్ లక్ష్మణ్ నాయక్‌కి హాథీరాం బావాజీ మఠ్ పరిరక్షణ సమితి కన్వీనర్ శివనాయక్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద ఆయన కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో బంజారా జాతికి చెందిన వారు 15 కోట్ల మంది ఉన్నారని, అందరూ సంవత్సరంలో ఏదో రోజు తిరుమల వచ్చి బాలాజీ దర్శించుకుని హాథీరాం బావాజీ మఠాన్ని సందర్శిస్తారని తెలిపారు. బంజారాలు మఠంలో మాత్రమే వసతి పొందుతారని, కానీ ప్రస్తుతం మఠంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలకోట్ల ఆస్తులున్న మఠంలో హాథీరాం బావాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నామని, అధికారులు, దేవదాయశాఖ స్పందించకపోవడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బంజారా జాతి ప్రజలందరూ కలిసి మఠం భూమిలోనే ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆలయానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ కన్వీనర్ శివనాయక్, సభ్యులు ప్రభాకర్‌నాయక్, కిషోర్‌నాయక్, కుసుమహరి, హరిప్రసాద్‌నాయక్, ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

'రమాదేవి'లో..

అరుదైన శస్త్రచికిత్స


రోగి సుధాకర్‌రెడ్డితో డాక్టర్ శశిధర్‌రెడ్డి, వైద్యుల బృందం

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీరమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈఎన్‌టీ సమస్యతో బాధపడుతున్న రైతుకు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ ఆసుపత్రి అధినేత డాక్టర్ శశిధర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రైతు సుధాకర్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలలుగా బాధితుడికి ముక్కులో నీరు కారడం, తీవ్ర తలనొప్పి, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది, ముక్కులో నుంచి చెడు వాసన వస్తుండడంతో తమ ఆసుపత్రికి వచ్చారని అన్నారు. ఎంఆర్ఐ స్కాన్ ద్వారా సమస్యను గుర్తించినట్లు చెప్పారు. శస్త్ర చికిత్స అవసరం ఉండడంతో ఎండోస్కోపి ప్రక్రియ ద్వారా అతి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఖరీదైన ఈ వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు. మరో కేసులో గుర్రంకొండకు చెందిన సురేష్ గడిచిన ఐదేళ్లుగా ముఖం వాయడం తీవ్రమైన తలనొప్పి సమస్యతో బాధ పడుతున్నారని చెప్పారు ఆయనకు ఈఎన్‌టీ విభాగంలో మెరుగైన వైద్యాన్ని అందించామని తెలిపారు. వైద్య సేవలు అందించిన ఈఎన్‌టీ డాక్టర్ వంశీకృష్ణతేజ, ఇతర వైద్యుల బృందాన్ని ఆయన అభినందించారు.